క్లుప్తంగా

ఆర్టీసీని లాభాల బాటలో నడుపుదాం

మదనపల్లె సిటీ: ఆర్టీసీని లాభాల బాటలో నడుపుదామని స్థానిక ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం డిపో కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డిసెంబర్ నెలలో జిల్లాలో ఈపీకె 37.46, ఓఆర్ 70తో మొదటి స్థానం నిలిచినట్లు తెలిపారు. ప్రతి సిబ్బంది కలిసి మెలసి పని చేయాలని కోరారు. నూతన సంవత్సరంలో మరింత ఉత్సవంగా పని చేయాలన్నారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని హార్సిలీహిల్స్‌కు 23 బస్సులు నడిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఎం రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

8న పెన్షనర్స్ అసోసియేషన్ ఎన్నికలు

మదనపల్లె సిటీ: మదనపల్లె తాలూకా యూనిట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 8న నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బి.టీ.నరసింహులు, మునిగోపాలకృష్ణ తెలిపారు. అసోసియేషన్ నూతన కార్యావర్గం ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా అధ్యక్షులు సుధాకర్ పిళ్లై ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ఎన్నికలకు సభ్యులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

జూదరుల అరెస్టు

తంబళ్లపల్లె: మండలంలోని కోటకొండ ఎగువ సుగాలితండా వద్ద ఆదివారం కోడిపందెం ఆడుతున్న వారిపై ఎస్ఐ రామకృష్ణారెడ్డి సిబ్బందితో దాడి చేశారు. 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.12 వేల నగదు, మూడు కోడిపుంజులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట ఆడుతున్న వారు..

బి.కొత్తకోట: స్థానిక పీటీఎంరోడ్డులోని చింతతోపులో పేకాట ఆడుతున్న వారిని ఆదివారం అరెస్ట్ చేశామని ఎస్ఐ రామమోహన్ తెలిపారు. వీరి నుంచి పేక ముక్కలు, రూ.7,340 నగదు స్వాధీనం చేసుకొన్నామని తెలిపారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ములకలచెరువు: యూటీఎఫ్ 2023 క్యాలెండర్‌ను ఎంఈఓ వెంకటరమణ ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మార్సీలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ అంకిత భావంతో ఉపాధ్యాయులు విధులు నిర్వహించి, పిల్లలను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ఉపాధ్యాయులు అజ్మతుల్లా, హరిబాబు, లక్ష్మీరమణ, రెడ్డిబాషా తదితరులు పాల్గొన్నారు.

కలకడ సీఐగా పి.నాగేంద్ర బాధ్యతల స్వీకరణ



కలకడ : కలకడ సీఐగా పి.నాగేంద్ర ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ సురేష్‌రెడ్డి పోరుమామిళ్లకు బదిలీ అయ్యారు. ఆస్థానంలో కడప ఏసీబీలో సీఐగా విధులు నిర్వహిస్తున్న పి. నాగేంద్ర ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు బదిలీపై కలకడ సీఐగా బాధ్యతలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉత్సాహంగా న్యూ ఇయర్ వేడుకలు

- న్యూ ఇయర్ వేడుకల్లో యువత
- ప్రజాప్రతిధులకు శుభాకాంక్షల వెల్లువ
- ఆలయాలు పూజలు, చర్చిల్లో ప్రార్థనలు



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా



సబ్ కలెక్టరేట్‌లో ఆర్డీఓ ఎం.ఎస్.మురళికి శుభాకాంక్షలు తెలుపుతున్న వీఆర్వోలు

మదనపల్లె : ఆంగ్ల నూతన సంవత్సరాది 2023ను పురస్కరించుకుని ఆదివారం నియోజకవర్గంలో న్యూ ఇయర్ వేడుకలను ఉల్లాసంగా ఉత్సాహంగా జరుపుకున్నారు. రెండేళ్లుగా కరోనా ఆంక్షలతో నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉన్న ప్రజలు ఈ ఏడాది రెట్టింపైన ఉత్సాహంతో, నయా జోష్‌తో సందడి చేశారు. శనివారం సాయంత్రం నుంచే పట్టణంలో నూతన సంవత్సర సంబరాలు మొదలయ్యాయి. రాత్రి 9 గంటల నుంచి టపాకాయల పేలుళ్లు, యువకులు టూ వీలర్లతో రోడ్లపై చక్కర్లు కొట్టారు. సరిగ్గా అర్ధరాత్రి 12గంటలకు కేక్ కటింగ్‌లు, బాణాసంచా పేలుళ్లతో పట్టణం కోలాహలంగా మారింది. ఆదివారం వేకువజామునుంచే పట్టణంలో నూతన సంవత్సర సందడి మొదలైంది.

శుభాకాంక్షల వెల్లువ

ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఉదయం 8 గంటల నుంచే నియోజకవర్గంలోని మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో ఎమ్మెల్యే నివాసానికి తరలివచ్చారు. శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన ప్రతి ఒక్కరినీ ఎమ్మెల్యే పేరుపేరునా అప్యాయతగా పలుకరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త ఏడాది నియోజకవర్గ ప్రజలందరికీ సుఖశాంతులు కలుగజేయాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపినవారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకావెంకటాచలపతి, నూర్‌ఆజం, జెడ్పీటీసీ సభ్యులు ఉదయ్‌కుమార్, వెలుగుచంద్ర, ఎంపీపీలు రెడ్డెమ్మ, నరసింహులు, కుసుమకుమారి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, డీఎస్పీ కేశప్ప, తహసీల్దార్ సీకే.శ్రీనివాసులు, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, లీలామాధవి, వైస్ ఎంపీపీ నందినితాజ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ అందేలా చూడాలి

రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. ఆదివారం ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా డివిజన్‌లోని తహసీల్దార్లు, రెవెన్యూ, సబ్‌కలెక్టరేట్ సిబ్బంది ఆర్డీఓ కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఏఓ శేషయ్య, డివిజనల్ డిప్యూటీ సర్వేయర్ మునికన్నన్, వీఆర్వో సంఘ అధ్యక్షులు హేమాంబర్‌రెడ్డి, శేఖర్, సురేంద్రరెడ్డి, రవికుమార్, రామకృష్ణ, సంజీవ్‌కుమార్, ముజీబ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కురబలకోట: నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెట్టు, అంగళ్లు మల్లయ్యకొండ, చేనేతన గర్ వినాయ విగ్రహం వద్ద భక్తులు కిటకిటలాడారు. మండలంలోని వివిధ చర్చిలు, మందిరాల్లో కూడా నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. కొత్త ఆశలతో కాలం విలువ తెలుసుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అంగళ్లు సీయోను ప్రార్ధన మందిరం దైవ సేవకులు విక్టర్ వేదనాయకమ్ ఉద్బోదించారు.

పర్యాటకులతో కిక్కిరిసిన గుర్రంకొండ కోట

గుర్రంకొండ: మండలంలోని పలు గ్రామాల్లో 2023 నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం వేకువజామునే గ్రామాల్లో కేక్‌లు కట్ చేసి బాణా సంచాపేల్చి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. మండలంలోని తరిగొండలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, గుర్రంకొండలోని కోట వినాయకాంజి నేయస్వామి ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. చారిత్రాత్మక గుర్రంకొండ కోట పర్యాటకులతో కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి సాయంకాలం వరకు పెద్ద ఎత్తున పర్యాటకులు కోటకు చేరుకొని ప్రకృతిని ఆస్వాదించారు. పలువురు కొండపైకి ఎక్కి సాయంకాలం వరకు అక్కడే గడిపారు.

ములకలచెరువు: నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సోంపాళ్యం శ్రీకోటచౌడేశ్వరీదేవి ఆలయం, శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం, బురకాయలకోట ముత్యాలమ్మ ఆలయం, వేపూరికోట శ్రీ ఆంజనేయ ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సోంపాళ్యం శ్రీ చెన్నకేశవస్వామి ఆలయానికి పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చారు. పురాతన శిల్పాలు, ధ్వజస్తంభం చూసి భక్తులు తరించారు.

మదనపల్లె సిటీ: నూతన సంవత్సరం పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక అయ్యప్పనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసి దర్శనం కల్పించారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డప్పరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు. స్థానిక యోగభోగేశ్వరస్వామి ఆలయం, వెంకటరమణస్వామి ఆలయం, సోమేశ్వరస్వామి ఆలయం, మంజునాథస్వామి ఆలయాల్లో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పీలేరు రూరల్ : నూతన సంవత్సర వేడుకలు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. పలు చోట్ల 2023 కేక్ కట్ చేసి పంచిపెట్టారు. స్థానిక వెంకటాద్రిక్ష సమీపంలో వెంకటేశ్వరస్వామి ఆలయం, కోటపల్లె శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయం, అగ్రహారం లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక వీఎస్ నర్తనశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ మోహన్‌రెడ్డి, సర్పంచ్ హబీబ్‌బాబాషా, నిర్వాహకులు మయూర్‌నాథ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కలకడ : మండంలో నూతన సంవత్సరం వేడుకలు ఘనంగ జరుపుకున్నారు. శనివారం అర్ధరాత్రి 12.01గంటలకే కేక్‌కట్ చేసి యువత 2023 ఏడాదికి స్వాగతం పలికారు. ఆదివారం ఉధయం స్థానిక ఆలయాలు,చర్చిలలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



గుర్రంకొండ కోటలో పర్యాటకుల సందడి



ములకలచెరువు: చెన్నకేశవస్వామి ఆలయంలో పర్యాటకులు



మదనపల్లె సిటీ: అయ్యప్ప స్వామిని దర్శించుకుంటున్న భక్తులు





మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే చింతల, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

ముక్కోటికి వెంకన్న ఆలయం ముస్తాబు



ప్రత్యేక అలంకరణలో ఉత్తర ద్వారం

మదనపల్లె సిటీ: ముక్కోటి ఏకాదశికి పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయంలో ఉత్తర ద్వారంకు ప్రత్యేక అలంకరణ చేశారు. ఏడు ద్వారాలను ఏర్పాటు చేశారు. వేకువజాము నుంచి భక్తులకు ఉత్తరద్వారం ద్వారా దర్శనం కల్పించనున్నట్లు ఆలయ ఈఓ రమణ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బింగిపాండు, మాజీ సభ్యులు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. భక్తుల కోసం క్యూ ఏర్పాటు చేశారు. ఉదయం స్వామికి అభిషేకాలు, గోదాదేవి పూజలు చేసి ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఆలయాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. దీంతో పాటు శ్రీవారినగర్‌లోని లక్ష్మి నరసింహస్వామి ఆలయం, బీటీ కాలేజీ మైదానం వద్ద నున్న వరాల ఆంజనేయస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సీఎం ఆశయాలు నెరవేరుద్దాం

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ శక్తి వంచనలేకుండా పని చేయాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజల సమక్షంలో నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి, అందరికీ పంచిపెట్టారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నలుమూలల నుంచి వచ్చిన అభిమానులు, కార్యకర్తలు, వివిధశాఖల అధికారులు, ప్రజలు ఎమ్మెల్యే చింతలను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు ఉదయం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సదుంలోని రాష్ట్ర గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, దుశ్శాలవతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి పలువురు వైఎస్సార్‌సీపీలో చేరిక

మండలంలోని నగిరిమడుగు పంచాయతీ బురుజుగడ్డకు చెందిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమక్షంలో ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఎంపీటీసీ పిఎస్ వెంకట్రమణరెడ్డి, రామిరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, హరినాథరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, సుధాకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, నారాయణ రెడ్డి తదితరులు తదితరులు ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు.

పండుగలా వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ



పెద్దతిప్పసముద్రంలో పెన్షన్ కానుక పంపిణీ చేస్తున్న ఎంపీపీ మహమూద్



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఏపీ టూరిజం కౌన్సిల్ మెంబర్ షాకీర్

పెద్దతిప్పసముద్రం: మండలంలో ఆదివారం జరిగిన వైఎస్సార్ పెన్షన్ పెంపు పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణం తలపించేలా నిర్వహించారు. ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, మండల కన్వీనర్ సుబ్బరాంలతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీల సమక్షంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తూ,పలు చోట్ల కేక్ కట్ చేసి వృద్ధులకు పెన్షన్ కానుక అందజేశారు. పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి రూ.250ల చొప్పున పెంచి హామీని అమలు చేస్తూ ఈ ఏడాది ఒకొక్కరికీ రూ.2750ల చొప్పున పంపిణీ చేసారని ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు.

పెన్షన్ లబ్ధిదారుల కళ్లలో నూతనోత్సాహం

పీలేరు : ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి రూ. 2750కి పెంచి నూతన సంవత్సరం సందర్భంగా ఇవ్వడంతో పెన్షన్ లబ్ధిదారుల కళ్లలో నూతనోత్సాహం నింపిందని ఏపీ టూరిజం కౌన్సిల్ మెంబర్ షాకీర్ తెలిపారు. ఆదివారం పీలేరు పట్టణంలో పలు ప్రాంతాల్లో పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మురళిమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో మొదటి రోజే 90 శాతం పంపిణీ జరిగినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 9706 పెన్షన్లకు గానూ రూ. 2.16 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. రెండు రోజుల్లో వందశాతం పూర్తి చేస్తామని తెలిపారు.

పింఛన్ల పంపిణీ

ములకలచెరువు: మండలంలోని పెద్దపాళ్యంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఎంపీపీ సాయిలీలా, ఎంపీడీఓ అశ్వని తనిఖీ చేశారు. ఈ నెల నుంచి పింఛన్ రూ.2,750 పంపిణీ చేశారు. మండలం మొత్తం 87.83 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

95 శాతం పంపిణీ

తంబళ్లపల్లె: మండలంలో ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా పెన్షన్లు అందజేశారు. మండలానికి 6,142 మంది పెన్షన్‌దారులకు రూ. 1,69,52050లు విడుదల కాగా గ్రామ వలంటర్లు, ప్రజా ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా 95 శాతం మందికి పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ ఆనంద కుమార్ తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న వెల్‌విషర్స్ సభ్యులు

మదనపల్లె సిటీ: రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా ఆస్పత్రి బ్లడ్‌బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమరాతమ్మ అన్నారు. స్థానిక జిల్లా ఆస్పత్రిలో నూతన ఆంగ్ల నూతన సంవత్సరాది పురస్కరించుకుని వెల్‌విషర్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరంతో నూతన సంవత్సరాన్ని ఆరంభించడం శుభ పరిణామని తెలిపారు. 50 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వెల్‌విషర్స్ నిర్వాహకులు గిరీష్, సభ్యులు విజయ్, రెడ్డిశేషు, మురళీకృష్ణ, హరిబాబు, జ్ఞానేంద్ర తదితరులు పాల్గొన్నారు. రక్తదానం చేసిన దాతలకు తిరుమల లడ్డులను అందజేదశారు.

నేడు వైకుంఠ ఏకాదశి పూజలు

కలకడ : మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురంలో వెలసిన శ్రీసాయి మందిరంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, పూజారి నాగయ్యస్వామి తెలిపారు. ఉదయం 6 గంటలకు కళశస్థాపన, 9గంటలకు గోపూజ, 10 గంటలకు 108 కళశ కుండల అభిషేకాలు, 11గంటలకు గీతాపారాయణం, రాత్రి 8గంటల నుంచి అన్నదానం, స్వామివారిని పల్లకీలో ఊరేగింపు ఉంటుందని తెలపారు. తెల్లవారు జామున అగ్నిగుండ ప్రవేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

భీమ్ కోరేగావ్ యుద్ధ వీరులకు నివాళి

పీలేరు : వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భీమ్ కోరేగావ్ యుద్ధ వీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద భీమ్ కోరేగావ్ యుద్ధం విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలమహానాడు నాయకులు మాట్లాడుతూ భీమ్ కోరేగావ్ యుద్ధం జరిగి నేటికి 205 సంవత్సరాలు అయ్యిందన్నారు. అంబేడ్కర్ తన మరణం వరకు ప్రతి ఏటా ఇదే రోజున విజయస్తూపం వద్ద నివాళులర్పించేవారని తెలిపారు. మన వీరుల గాధలు పిల్లలకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు ధరణికుమార్, మల్లికార్జున, హరిబాబు, ఆనంద్, గంగాధర్, లోకనాథం, విజయ్, రవీంద్ర, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న పాస్టర్ బి.జెర్మియా

పీలేరు రూరల్ : స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని ఏసీఎల్ఎం చర్చిలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పేదలకు దుస్తులకు, పిల్లలకు బహుమతులు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ బి. జెర్మియా మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఏసుప్రభువు ప్రజలను చల్లగా చూడాలని ప్రార్థించారు. కార్యక్రమంలో పలువురు క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

విశ్రాంత డీసీహెచ్ఎస్ రవీంద్రనాయక్ మృతి



రవీంద్రనాయక్ (ఫైల్)

మదనపల్లె : పట్టణంలోని నాయక్ ఆస్పత్రి డాక్టర్, విశ్రాంత డీసీహెచ్ఎస్ రవీంద్రనాయక్ ఆదివారం ఉదయం మృతి చెందాడు. సత్యాసాయి జిల్లా బుక్కపట్నం మండలం నారాశింపల్లె తండాకు చెందిన డాక్టర్ రవీంద్రనాయక్ 1982లో తంబళ్లపల్లె పీహెచ్‌సీ వైద్యులుగా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి చిత్తూరు, హిందూపురం, మదనపల్లె ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెడికల్ సూపరింటెండెంట్ హోదాలో విధులు నిర్వర్తించారు. 1996లో చిత్తూరుజిల్లా డీసీహెచ్ఎస్‌గా పదోన్నతి పొందారు. తర్వాత మదనపల్లె ప్రభుత్వవైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టి 2008లో పదవీ విరమణ చేశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం ఉదయం పట్టణంలోని సొసైటీకాలనీలోని తన నివాసంలో కన్నుమూశారు.

ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజల్లోనే ఉండాలి

–వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



ఎమ్మెల్యేను కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమాపతిరెడ్డి, ప్రజాప్రతినిధులు

బి.కొత్తకోట: ఇకపై పార్టీకి చెందిన ప్రతి ప్రజాప్రతినిధి, నామినేటేడ్ పదవుల్లోని నాయకులు నిత్యం ప్రజల్లోనే ఉండాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సూచించారు. ఆదివారం నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యేని కలిశారు. ఈ సందర్భంగా అందరితోనూ ఎమ్మెల్యే విడివిడిగా సమావేశమయ్యారు. నియోజకవర్గంలో మండలాల వారీగా మూడున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, ఇంకా జరుగుతున్న అభివృద్ధి పనులు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జరగలేదు. ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలపాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాను ఇంటింటికి వెళ్తున్నానని, గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలు వారి సచివాలయాల పరిధిలో జరిగిన అభివృద్ధి, అమలైన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను పూర్తిస్థాయిలో ప్రజలకు తెలిసేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించడంలో వైఫల్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏమి చేసిందో చెప్పుకుంటే చాలని, లేనిది చెప్పుకోవాల్సిన అవసరం లేదన్నారు.

సులభ పద్ధతిలో వరి పంట నూర్పిడి



వరి పంటను కోస్తున్న యంత్రం

పెద్దతిప్పసముద్రం: వ్యవసాయంలో కూలీల ఖర్చు తగ్గించేందుకు రైతుల సౌకర్యార్థం నూ తన సాంకేతిక పరికరాలు, యంత్రాలు అందుబాటులోకి వచ్చా యి. కోత దశకు వచ్చిన వరి పంటను కోసి, నూర్పిడి చేయాలంటే రైతులకు ఎకరాకు రూ.10 వేల దాకా ఖర్చు వస్తుంది. అయితే తమిళనాడు నుంచి వచ్చిన ఈ యంత్రం గంటకు రూ.4 వేలు చెల్లిస్తే ఎకరా పొలంలోని పంటను నూర్పిడి చేస్తుందని రైతులు పేర్కొంటున్నారు. పొలంలో ఎంత బురద ఉన్నా సులువుగా కోసి వరిని అందులోనే నిల్వ చేసుకుంటుందన్నారు. పని వేగవంతం కావడంతో పాటు తద్వారా కూలీల ఖర్చు కూడా తగ్గుతుందని రైతులు పేర్కొంటున్నారు.